# పత్రహారితం

డా॥ అబ్బరాజు మైథిలి

"నాలుగు రోజులలో తిరిగి వస్తావా?" అడుగుతున్నాడు, ఆజ్ఞాపించటం లేదు- కనుక-

"అలాగే" అన్నాను అన్యమనస్కంగానే.

"ఏమైనా కావాలా?" నేను జవాబిచ్చే లోగానే వెళ్ళి తీసుకొచ్చి ఇచ్చాడు- బోలెడు పుస్తకాలు, ఓ పెద్ద కప్ ఐస్‌క్రీమ్, లిల్లీలు. నా ఇష్టాలు ఇంతలా గుర్తున్నాయా, ఇప్పుడు తెలుసుకుంటున్నాడా- ఇరవైఏళ్ళ సహచర్యం తర్వాత? నడివయసు వచ్చాక తెలిసే ఇల్లాలి విలువ కాబోలు ఇది.

ఉద్యోగానికి సెలవుపెట్టి ఈ అయిదు నెలలూ తన ఆరోగ్యం గురించే ఇక్కడ ఉండిపోయాను. ఉద్యోగపు కొత్త హోదా తెచ్చిపెట్టిన స్ట్రెస్, పద్ధతిలేని భోజనం, హద్దుదాటిన స్మోకింగ్ కలిసి అల్సర్ తెచ్చిపెట్టాయి తనకి. సర్జరీ చేయవలసే పరిస్థితి అట- ఆ అవసరం రాలేదు మొత్తానికి- మానిపోయింది వ్రణం. ఇదివరకంతా యధాలాపంగా, ఒక హక్కులాగా టేకింగ్ ఫర్ గ్రాంటెడ్ అంటారే అలాగ- తీసుకున్న నా సేవలూ సహచర్యమూ ఇప్పుడు చాలా అపురూపంగా అనిపిస్తున్నాయి అతనికి- తెలుస్తోంది నాకు.

ఈ మద్రాస్ నుంచి మెయిల్ బాగా పొద్దుపోయాక బయలుదేరుతుంది. చదువుకొనే వేళ కాదు. చదువుకోకపోతే నిద్రరాని నాకు ఈ రాత్రికి చదవాలనీ లేదు, నిద్రపోవాలని కూడా లేదు. నా మనసు నిండా మృదుల- తనకోసమైన నా బెంగ! వెంటాడే పాటలాగా నిలవనీయటంలేదు జ్ఞాపకం- చీకటిలా ముసురుకుంటున్న దిగులు-

** ** **

నా కేమవుతుంది- నా స్టూడెంట్ అంతేనా- పదిహేనేళ్ల వయోభేదం అడ్డురాని ఆత్మీయత మాది. ఆరునెలలైపోయింది చూడక. క్రమం తప్పని ఉత్తరాలు అలవాటు కాకపోయినా, ఇంత ఎడం ఎప్పుడూ లేదు. వైజాగ్ వెళ్లిందని, అరకులో ఉందని... చివరికి ఇప్పుడున్న చోటుకి ఫోన్‌లేదని! రవి- ఆమె భర్త కూడా చాలా ప్రయత్నం తర్వాత నాలుగురోజుల క్రితమే ఫోన్‌లో దొరికాడు. ఆంధ్రలో ఇంకా సెల్ ఫోన్‌లు విరివిగా రాని కాలం. శ్రీకాంత్ ఆరోగ్యం ఒక కొలిక్కి వచ్చిందని డాక్టర్ చెప్పాక నేను కట్టుబడిపోయిన కర్తవ్యాన్ని నడలించి ఇప్పుడు బయలుదేరగలిగాక- ఒక్క నిమిషం కూడా తనని చూడకుండా ఆగలేకపోతున్నాను.

మొదటిసారిగా ఆ బియే ఫస్టియర్ క్లాస్‌లో అంతమంది మధ్యన చూసినప్పుడు ఎంత హాయిగా అనిపించిందో. అందమో కాదో తెలియదు- ఆమె ఒక అనుభూతి. ఎట్లా ఉండేది తను- తెల్ల తామరపువ్వులాగా, ముత్యాల రాశిలాగా! ఆ సుకుమారమైన పరిమళం, మెత్తటి కాంతి తన చుట్టూపరచుకొని ఉండేవి. అదొక నిర్మలత్వంతో కలిసిన శీవి ముఖంలో.

నేను బోధించేది ఆంగ్ల సాహిత్యాన్నే అయినా, తెలుగూ అంతకంటే ఇష్టం ఇద్దరికీ. ఆ గుంటూరు విమెన్స్ కాలేజీ ఆవరణలో చెట్లకింద- తనకి వివరించి చెపుతూ రెండు భాషలలోని గొప్ప కృతులని నేనూ తిరిగి గాఢంగా ఆస్వాదించగలిగేదాన్ని. ఇట్లాంటి ఆడపిల్లలు కదా సాహిత్యాన్ని అధ్యయనం చేయవలసిందీ బోధించవలసిందీ అనిపించేది. ఆ మార్దవం, తీవ్రత, రెపరెపలాడిపోయే హృదయం- కల




లోంచి దిగి వచ్చినట్లుండేది తను.

అప్పుడు నాకు హైస్కూల్‌లో చదివే ఇద్దరు మగపిల్లలు. నా భర్త శ్రీకాంత్‌కి అది సొంత ఊరు కావటంతో వచ్చీపోయే బంధువుల హడావుడి. సహాయం చేయటం శ్రీకాంత్‌కి తెలియదు, పిల్లలూ నేర్చుకోలేదు. అంత శ్రమా పడినాక ఎవరితోనో ఏదో ఒక పొల్లుమాట అనిపించుకొని శరీరమూ మనసూ నలిగిపోయి కాలేజ్‌కి వచ్చాక- తనని చూస్తూనే జీవిత మాధుర్యమంతా స్పృహలోకి వచ్చేది నిజంగా.

వీలు చేసుకొని వాళ్ల ఇంటికి వెళ్లేదాన్ని. శ్యామలానగర్ ఆ ఊరి చివరి అందమైన లొకాలిటీ అప్పట్లో. అక్కడ ఇంకా చివరగా- ఉండేది వాళ్ల ఇల్లు, వనమాల దాని పేరు. చుట్టూ పెద్ద తోట. అంతదూరాన ఉండగానే గోరింట, పొగడపూల సౌరభాలతో ఆహ్వానిస్తూ. ఎంతో సౌందర్యం, మార్మికత- అసలది తోటకాదు అరణ్యమేమో. ఎన్నిసార్లు చూసినా ఏదో కొత్త ఆకుపచ్చదనం ఆశ్చర్యపరచేది. ఇల్లు అంత పెద్దదికాదు, కాని సుఖంగా శాంతిగా ఉండేది. ఆ వాతావరణం అంతా తనూ తల్లీతండ్రీ ముగ్గురూ కలిసి సృష్టించుకొన్న స్వర్గం.

వాళ్ల నాన్న నిన్నమొన్నటిదాకా తమ్ముళ్లవీ చెల్లెళ్లవీ చదువులూ పెళ్లిళ్లూ పూర్తిచేసి ఎప్పుడో కొన్న ఆ చోటులో ఇల్లు కట్టుకోగలిగారు లోన్ తీసుకొని. వాళ్లమ్మకి మిగిలిన కాసిని నగలూ లోన్ తీర్చేందుకు అయిపోయినాయి. ఆయన బాంక్‌లో పనిచేసేవారు. తల్లి రేడియోలో కాజువల్ ఆర్టిస్ట్. చాలా నిరాడంబరంగా ఉండేవారు. అసలు ఎక్కువ మాటలే వినిపించేవి కావు ఆ ఇంట్లో- అంతా చల్లటి నిశ్శబ్దం. ఆయన ముఖేష్‌ని మంద్రస్థాయిలో వింటూండేవారు, ఆమె చదువుకుంటూ ఉండేవారు తీరికగా ఉన్నప్పుడు. ఎవరైనా అడిగితేనేగాని ఆమె పైకి పాడేవారు కాదు. పాడితే మాత్రం ఆ ఇల్లంతా తీయదనంతో నిండిపోయేది. సాయంత్రమయితే అలముకొనే చందనపు అగరువత్తుల సుగంధం, సన్నటి వాద్యసంగీతం- ఏ సితారో వేణువో, గుసగుసలు చెపుతున్నట్లు. ప్రపంచపు వక్రత్వంతో ఏ సంబంధమూ లేని గొప్ప లయ అక్కడ ధ్వనించేది.

మృదుల ఏ విషయంలోనూ 'ఒత్తిడి'ని ఎదుర్కోలేదు. తమ బాధ్యతల మధ్య ఎక్కువ మందిని చక్కగా పెంచలేనని ఆమె ఒక్కరినే కన్నారు. తన మీద శ్రద్ధ చూపాలని ఉద్యోగం మానారు. తను పెద్దదయినాకే తిరిగి పాడటం ప్రారంభించారట. మృదుల తెలివైన విద్యార్థిని. వాళ్ల నాన్నకి తన బియే అవగానే సివిల్స్ రాయించాలని ఉండేదిట. కాని తను లిటరేచర్‌లోనే పైకి చదువుతానంటే అభ్యంతర పెట్ట

లేదు. అందరమూ కలిసి తనని ప్రేమించాం- ముద్దుచేశాం- మరీమరీ సున్నితం చేశాం. తనని తను ఎలా కాపాడుకోవాలో నేర్పలేకపోయాం.

మూడో సంవత్సరపు సంక్రాంతికి రవి వచ్చాడు అక్కడికి. అప్పుడే 'లా' పూర్తయింది అతనికి. రాజమండ్రిలో మూడుతరాల నుంచి వాళ్లు 'న్యాయ'వాదులు. వీళ్లకి దూరపు బంధువు కాబోలు. ఏదో కేసు వివరాల కోసం గుంటూరు వచ్చి పని పూర్తయాక కూడా ఉండిపోయాడు మృదులకోసం. చలదళం వంటి ఈమె తిరిగి స్పందించింది. ఒక సాయంత్రం తీసుకొచ్చి పరిచయం చేసింది. అందమైనవాడు, మంచితనం ఉంది ముఖంలో. బలమైన ఆకర్షణ వెదజల్లే కళ్లు. కాని- రాజారాంగారు అన్నట్లు "లోకజ్ఞతకు కాణాచి"లాగా ఉన్నాడతను. మృదులని అతను ప్రేమించటం ఆశ్చర్యం కాదు. పువ్వులు ఇష్టంలేనిది ఎవరికి? కాని ఆ నాజూకుతనాన్ని గౌరవించి నిలుపుకోగలగటం ఎంతమందికి సాధ్యమవుతుంది? ఒక్క నిమిషం మాట్లాడకుండా ఉండలేని ఇతనికి ఆ మునివాటికతో ఏమి సంబంధమూ అనిపించింది.

కాని నా సంశయాలేవీ నేను మృదులతో చెప్పలేదు. తను అడగలేదు కూడానేమో. మొదటిసారిగా మా అనుబంధంలోని ఒక అసమగ్రత నాకు తట్టింది. స్నేహితురాలికుండే చనువులేదు, లెక్చరర్‌కుండే పెద్దరికమూ లేదు నాకు తన పట్ల. అయ్యో నాలో మమకారానికీ ఆపేక్షకీ మాత్రం లోటు లేదుకదా.

అంతా చకచకా అయిపోయింది. చల్లని చలి కాలంలోగాని పెళ్లి చేసుకోకూడదు అనే మృదులకి ఆ మే నెలలో అతనితో పెళ్లి అయిపోయింది. వాళ్ల అమ్మకీ నాన్నకీ ఊపిరి తీసుకొనే వ్యవధి కూడా ఇవ్వలేదు. తను ఒక స్థాయికి చేరాకగాని పెళ్లి తలపెట్టాలనుకోలేదు వాళ్లు- తనే ముందు అడిగేశాక వద్దని అనలేకపోయారు.

నేనొక నెలరోజులు ట్రయినింగ్‌కి వెళ్లి తిరిగి రాగానే ప్రకటించింది మృదుల- 'లా'లో చేరాను మేడమ్ అని. ఈమె పేశలత్వం ఎక్కడ- న్యాయశాస్త్రం ఎక్కడ? ప్రతిరోజూ మనుషుల క్రూరత్వాన్ని తరచి చూసి నిగ్గుతేల్చాలికదా- తట్టుకొంటుందా? సర్వ శుక్ల- సరస్వతీదేవి ఉండవలసింది సత్యలోకంలో కదా- అబద్ధాన్ని అంటకుండా తను ఈ వృత్తిని ఈదగలదా?

"రవి కేవలం సూచించాడంతే మేడమ్, నేనే ఆలోచించాను. తనతో కలిసి పనిచేయటం బావుంటుందనిపించింది. ఎంప ప్రైవేట్‌గా చదువుతాను. నా ఇష్టం నాదేకదా!"

నీ ఇష్టం నీదికాదూ అని అరిచి చెప్పాలనిపించింది. నిన్నంతా నైవేద్యంగా పెట్టేస్తున్నావు సుమా అని హెచ్చరించాలనిపించింది. కొంత తేలికయిన మాటలతో మందలించాను. నవ్వేసింది- "మీదంతా చాదస్తం మేడమ్, లా చదివితే ఎన్ని మంచి పనులు చేయచ్చో మీకు తెలీదా?"

గుంటూర్లోనే 'లా' చేసింది మృదుల. అతను వస్తూ పోతూ ఉండేవాడు. చాలా ఆనందంగా కనపడేది. ఏం చదివేదో ఎప్పుడు చదివేదో- అస్తమానం అతని ధ్యాస, అతని గురించే మాటలు. ప్రేమించిందికదా అతన్ని- సర్వార్పితం అయిపోయింది. ఆపైన తరుణ వయస్సు.

చదువయిపోయి తను 'వనమాల' వదిలివెళ్లే సమయం వచ్చింది. తల్లితండ్రీ చాలా బెంగపడ్డారుకాని, తను మాత్రం సరదాగానే ఉంది. "అక్కడా ఉంటాను, ఇక్కడా ఉంటాను రైల్లో నాలుగైదు గంటలేకదా" రవి ఇచ్చాడు కాబోలు ఆ ధైర్యాన్ని. అలాగే వస్తూండేది మొదట్లో వారానికోసారి, తర్వాత పదిహేనురోజులకొకసారి.

**"లోకజ్ఞతకు కాణాచి"లాగా ఉన్నాడతను. మృదులని అతను ప్రేమించటం ఆశ్చర్యంకాదు. పువ్వులు ఇష్టంలేనిది ఎవరికి? కాని ఆ నాజూకుతనాన్ని గౌరవించి నిలుపుకోగలగటం ఎంతమందికి సాధ్యమవుతుంది?**

మాధవిగారు- మృదుల తల్లి చెప్పారు అక్కడి సంగతులు. పెద్ద ఉమ్మడి కుటుంబం వాళ్లది. అన్ని పనులకీ మనుషులు ఉన్నా ఎవరికీ పని తెమలదు, తెముల్చుకోరు. ఇంచుమించు ప్రతిరోజూ ఏదో వ్రతమో పూజో ఉండేది. వాటికి అన్నీ సమకూర్చుకోవటం- అయిపోయాక సర్దుకోవడం ఇదే దినచర్య. ఉన్న ఊరు కావటంతో ఎడతెగని అతిథులు- వాళ్లందరినీ సంబాళించుకోవాలిట కోడలు. పెళ్లికి ధగధగలాడే పట్టుచీరలూ మెరిసిపోయే నగలూ పెట్టారు మృదులకి. తెలిసినవాళ్లందరూ వచ్చి చూసి వెళ్లిపోయేదాకా అవి రోజూ ధరిస్తూ భరిస్తూ ఉండవలసిందే. తను రోజూ కట్టుకొనే మెత్తటి లేత రంగుల చీరలు వాళ్లకి నాసిగా ఉండేవి. ఒకరోజు రవి అక్క అందిట రవితో "పిచ్చిదానిలా ఉండేది కదురా మృదుల పెళ్ళికి. ఇప్పుడెంత కళకళలాడిపోతోందో. మీ అత్తగారూ మామగారూ ఇప్పటికీ వెర్రిమాలోకాల్లాగే ఉన్నారు. ఆవిడ మరీనూ- మూసివాయనం ముత్తయిదువులాగా!"

ఎవరినీ దురుసుగా ఒక మాట అనటం, పడటం అసలు తెలియని మృదులకి నిలువునా రగిలిపోయింది. రవి నాన్నగారిది మంచి ప్రాక్టీస్. క్రిమినల్ లాయర్ ఆయన. రవి అక్కడే జూనియర్. మృదులని వృత్తిపరంగా కూడా "తీర్చిదిద్దటం" మొదలెట్టారు.

అన్నీ చేసేది, పట్టించుకొనేది- అతనికోసం. కాని తనదీ అనే తీరికంటూ దొరికేదేకాదు. ఇంచుమించు ప్రతిరోజూ రాత్రి పదకొండింటిదాకా సామూహిక సంభాషణ జరిగేది. తెల్లవారి అయిదుగంటలకి లేవాలి- లేపేవారు. ప్రేమికుడు రవి చాలా సునాయాసంగా భర్త రవిగా రూపాంతరంచెందాడు. ఈపిల్ల మాత్రం ఆ పిచ్చిలోనే పడి కొట్టుకొనేది, బాధపడేది.

ఆ ఇంటి తీరూ తెన్నూ అదివరకు అప్పుడప్పుడు వచ్చి వెళ్తుంటే అర్థమవలేదు. మీ ఇల్లు ఇలా ఉంటుందని నాకెందుకు చెప్పలేదూ అని బరస్ట్ అయింది రవిదగ్గర ఒకరోజు. మీ ఇల్లులా దయ్యాలకొంపలాగా బిక్కుబిక్కుమంటూ ఉండాలా అని అతను కర్కశ హాస్యం చేశాక మాత్రం- తెలిసింది అప్పుడు తనకి.

తను తరచుగా గుంటూరు వెళ్లటాన్ని చాలా తెలివిగా, బయటపడకుండా ఆటంకపరచేవాళ్లు. అవును, ఎవరికి మాత్రం ఉండదు వాళ్ల కోడల్ని వాళ్లింట్లోనే సౌకర్యవంతంగా అమర్చుకోవాలని? ఎదురుతిరిగి రభస చేయలేక తను రావటం బాగా తగ్గించింది.



మాధవిగారు నిబ్బరంగానే ఉన్నారుకాని మృదుల నాన్నగారు అసలు తట్టుకోలేకపోయారు. లోకసహజమైన ఎడబాటు ఆయనకి జీవన్మరణ సమస్య అయిపోయింది. ఉంటారు అటువంటి తండ్రులు- కూతురిని చూడనిది రోజు గడవని వాళ్లు- మరి వాళ్ల గతి ఏమిటని?

ఇంకా పదేళ్ల సర్వీస్ ఉంది ఆయనకి. ఇంటినీ మృదులనీ తూస్తే ఆయనకి మృదులే ముఖ్యం. అసలు తను లేనిది అది ఇల్లేకాదని? రాజమండ్రికి ట్రాన్స్‌ఫర్ కోసం ప్రయత్నించారు, వీలయింది. ఇల్లు అద్దెకిచ్చేసి వెళ్దామనుకుంటూండగా- రవి కల్పించుకున్నాడు. ఇక ఎలాగా ఇక్కడ ఉండబోయేది లేదుకదా, అమ్మేస్తే ఏమని. మొదట్లో చాలా షాకింగ్‌గా అనిపించింది ఆమాట.

కాని ఆలోచించీ, రవి నచ్చచెప్పిన మీదటా- అదే నిర్ణయానికి వచ్చారు. 'వనమాల'కి రూపాయలలో విలువకట్టి అమ్మేశారు. ఆ డబ్బుతో రాజమండ్రిలో మంచి సెంటర్లో కమర్షియల్ కాంప్లెక్స్ కొనిపించాడు రవి మృదుల పేరిట. ఆ కాంక్రీట్ భవనపు మూడో అంతస్తులో అపార్ట్‌మెంట్స్ కట్టారు- ఒకదాంట్లో వీళ్లు ఉండిపోయే లాగా. ఇల్లు ఖాళీచేసి అంతా వెళ్లిపోయారు.

కొన్నాళ్లకి- నా భర్తకి ప్రమోషన్ మీద మద్రాస్ ట్రాన్స్‌ఫర్ అయాక, పిల్లలిద్దరూ బిటెక్‌లోనూ, హాస్టల్లోనూ చేరాక అప్పటికి నాకు తీరిక దొరికింది.

మృదుల దగ్గరికి వెళ్లగల్గాను. పాతకాలపు ఇల్లు- కాని ఆ పురాతనత్వపు వైశాల్యం ఎక్కడా లేదు. ఎక్కడికక్కడ ఇరుకు గదులు. చుట్టూ నాపరాళ్లు- ఇంటినిండా ఎవరెవరో మనుషులు. మేడపైన ఆ మూలెక్కడో ఆమె గది అన్నారు. గోడలంతా ఆక్రమించి ఇనప బీరువాలు, జేగురురంగు రెక్సిన్ తొడిగిన సోఫా, మంచంమీద ముదురు తోపురంగు గళ్ల దుప్పటి.

"పర్లేదు మేడమ్ కూర్చోండి, మాపుకి ఆగుతుందికదా" అదీ తన పలకరింపు- అందులోనే తను చెప్పాలనుకొన్నదంతా ఉంది.

నీటిరంగుల చిత్రంలా ఉండే తన పాత గది గుర్తొచ్చింది. అలా ఏర్పరుచుకోవటానికి ఇక్కడకూడా ప్రయత్నించవచ్చుకదా అనబోయి ఆగిపోయాను. అదయినా పూర్తిగా తన సొంతమైతేకదా. నేను ఉండగానే ఇద్దరు ముగ్గురు అక్కడికి వచ్చి వాళ్లకి కావలసిన వస్తువుల కోసం వెదికి పట్టుకెళ్లారు.

"ఎన్ని గోడలలో ఎన్ని తలుపులూ తాళాలో చూశారా! మల్లాది రామకృష్ణశాస్త్రిగారు రాశారు గుర్తుందా ఒకచోట- మేము గొప్పవాళ్లంకదా- మా ఇంట్లో చెట్లుండవూ, రాళ్లుంటాయి నేల మీద. గుంటూర్లో మేము పేదవాళ్లంకదా, అందుకని బోలెడు చెట్లు. ఇక్కడ ఎంచక్కా కాగితాలు కేసులూ సాక్ష్యాలూ శిక్షలూ-ఎవరికి కావలిస్తే వారికే శిక్షలు తెలుసా" నవ్వుతోంది తను. భయంవేసింది నాకు. గతి తప్పుతోంది తను- స్పష్టంగా అర్థమవుతోంది. ఏం చేయాలి- ఏం చేయగలను?

ఆ ఊరికి కదలివచ్చిన ఆమె పుట్టింటికి వెళ్లాను. అక్షరాలా అది శూన్యగృహంలా ఉంది. మాధవిగారు దేన్నీ పట్టించుకొంటున్నట్లు లేదు. వనమాలని వదిలివచ్చిన విరక్తి వదల్లేదు ఆమెని. ఇక్కడి ఎడతెగని రణగొణధ్వని అసలేమీ తోచనివ్వటంలేదు. మాట్లాడుకొన్నాం చాలాసేపు- మంచి కౌన్సిలింగ్ అవసరం మృదులకి అని. నేను మళ్లీ సెలవు పొడిగించి తిరిగి రావాలని అనుకొన్నాను- ఈలోపల శ్రీకాంత్ అనారోగ్యం- ఇన్నాళ్లూ.

** ** **

మెయిల్ ఆలస్యంగా పన్నెండింటికి చేరింది రాజమండ్రి. హోటల్‌లో దిగి రవికి ఫోన్ చేశాను. నాలుగింటికి వచ్చాడు. క్రిస్ప్‌గా పెళపెళలాడుతూ లేడు ఎప్పటిలాగా- మెత్తబడిపోయాడు. ఊరుదాటి పొలిమేర దాటి ఎక్కడికో వెళుతోంది కారు. అప్పుడు చెప్పాడు- నర్వస్ బ్రేక్‌డవున్ వచ్చింది మృదులకి. ఇప్పుడు తగ్గింది, ఇక్కడే ఉంటున్నాం అని మూడు ముక్కలలో.

ఆ ఊరి పేరు కడియపు లంక. ఎక్కడో విన్నట్లుంది. అవును పువ్వులకి ప్రసిద్ధికదా.

"కసవు మించి పొసగుచోట మెలికలైన కాలిబాట"లోంచి వెళితే నిజంగానే ఒక ప్రియ కుటీర వాటిక- కుసుమ సముద్రాల మధ్యని.

మా అదృష్టంకొద్దీ సెన్సిటివ్ అయిన డాక్టర్ దొరికారు. నాలుగైదు సిటింగ్స్ తర్వాత తనని మాట్లాడించగల్గారు. పాత ఫోటోలూ సంగతులూ అన్నీ పరిశీలించి అన్నారు- వడలిపోయిందండీ ఈఅమ్మాయి, కాస్త నీళ్లు జల్లాలి అంతే అని. ఎండిపోయిందని అనలేదుకదా, మాకు ఆశ కలిగింది, ధైర్యం వచ్చింది.



లోపలంతా ఎన్నాళ్లకో చూస్తున్న మృదుల అభిరుచి. కర్పూరపు పూతలా ఉంది వాతావరణం. మృదుల ఫామ్‌లోపల ఎక్కడో ఉందిట. మాధవిగారు చెప్పుకొచ్చారు.

"మీరు వెళ్లిన మరుసటిరోజు నుంచి తనకి అసలు బాగాలేదు. అసలు ఆరోజే ప్రారంభమేమో. భార్యని ప్లాన్ చేసి నిలువునా నరికేసినవాడిని నిర్దోషిగా విడిపించారట. తనకి తెలియకుండా కాగితాలన్నీ తయారుచేసిందట. ఎలాగో విన్నది నిజం- ఇక తేరుకోలేదు. కదలదు, మెదలదు- మాట్లాడటం మానేసింది. నిద్రపోయేదికాదు. ఇద్దరు సైకియాట్రిస్ట్‌లు చూశారు. మేజర్ డిప్రెషన్ అని తేల్చారు. ఎప్పటినుంచో పెరుగుతూ వస్తున్నది ఆరోజు ఆ కారణంవల్ల బయటపడిందట. అత్తవారు గ్రహశాంతులు చేయించి తాయత్తులు తీసుకొచ్చారు. నేనే కట్టనివ్వలేదు. ఇంకెందుకొచ్చిన మర్యాదలండీ, నా పిల్ల అలా అయిపోయాక! వైజాగ్ వెళ్లాం చివరికి. మా అదృష్టం కొద్దీ సెన్సిటివ్ అయిన డాక్టర్ దొరికారు. నాలుగైదు సిటింగ్స్ తర్వాత తనని మాట్లాడించగల్గారు. పాత ఫోటోలూ సంగతులూ అన్నీ పరిశీలించి అన్నారు- వడలిపోయిందండీ ఈ అమ్మాయి, కాస్త నీళ్లు జల్లాలి అంతే అని. ఎండిపోయిందని అనలేదుకదా, మాకు ఆశ కలిగింది, ధైర్యం వచ్చింది. చివరికి మిగిలేది నవలలో శ్యామల గుర్తొచ్చిందట దీన్నిచూస్తే. మందులు రాశారు ఆమె, రాయకపోలేదు. కాని వాటితోపాటు చేయవలసింది చెప్పారు.

అరకులో ఉన్నాం ఒక నెలరోజులు. అలా కొండల్లో లోయల్లో తిప్పేవాళ్లం. నెమ్మదిగా మెరుగైంది. ఏ చెట్టు నీడనో కూర్చుని కాసేపు చదువుకుంటూ కాసేపు చుట్టూ చూస్తూ- మనుషుల్లో పడింది. మాట్లాడేది- తను అంతగా మాట్లాడటం నేనెన్నడూ ఎరగను. ఎక్కువగా చిన్నతనం గురించీ తర్వాత చదువుకొనే రోజుల గురించీ మన ఇంటికి వెళ్లిపోదాం అని అడిగింది. ఆ పాత ఇల్లు తిరిగి కొనలేము, వాల్యూ పెరిగిపోయిందక్కడ. ఆయన వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకుని ఆ డబ్బుతో ఏదో ఒకటి చేద్దామని అనుకుంటూండగా- రవి ఈ ఏర్పాటు చేశాడు.

ఇక్కడికి వచ్చిన మొదటిరోజు నుంచీ ఎంత సంతోషమో తనకి. రకరకాలుగా ఆలోచిస్తోందీ తోట గురించి. గ్రీన్ హవుస్ కూడా పెట్టి ఆర్కిడ్స్ పెంచుతోంది. రెగ్యులర్‌గా మందులు వేసుకుంటోంది. మళ్లీ పాత మృదులలాగే ఉంది. ఇకముందు- ఏమో, చదువుకుంటుందేమో మేమేమీ అడగట్లేదు- ఇలా కళ్లముందు తిరుగుతుంటే చాలుకదా తను!"

అప్పుడు వచ్చింది మృదుల. శరీర కష్టంతో వచ్చిన అలసటతో మెరుస్తూ ఆ నీరెండలో పసుపువచ్చని నేత చీరలో- శాలీనుడు వెంటలేని సుగాత్రిలాగా. ఊహూ- ఇదివరకటి మృదులకాదు- మారింది, ఎదిగింది. స్వచ్ఛమైన సరస్సుల్లా ఉండేవి కళ్లు- సంధ్య దీపాల్లా వెలుగుతున్నాయి ఇప్పుడు.

కొన్ని ఎకరాల మేర అంతా చూపించింది- పూసిన గులాబీలూ కనకాంబరాలూ లిల్లీలు- పూయబోయే మల్లెలూ జాజులూ- ఇంకా ఎదగవలసిన పొన్నలూ పొగడలూ పున్నాగలూ సంపెంగలూ... ఇంకా ఎన్నో- ఎంత వైభవమో!

ఏంచేస్తున్నారు వీటిని? అడిగాను. తను జవాబు చెప్పలేదు- దూరంగా ఏదో అజమాయిషీ చేస్తున్న రవి కనిపించాడు. వేరే అడగటమెందుకింక ఏంచేస్తున్నారూ అని- ఇతను ఉన్నచోట వృథా అవటం ఉంటుందా! కాని అతనివైపు చూస్తున్న ఆమె ముఖం- ప్రేమగా లేకపోయినా ప్రసన్నంగా ఉంది. క్షమిస్తుందా అతన్ని- ఈపాటికే క్షమించిందా?

లగేజ్ తెచ్చుకుందుకు హోటల్‌కి వెళ్లి తిరిగొస్తూంటే రవి చెప్పాడు- "మృదులకి ఏంతెలీదు- నేర్చుకొంటుందనుకొన్నాను. కొన్నాళ్లు ఆగి వేరే ఇల్లు తీసుకుందామనుకొన్నాను. ఉక్కిరిబిక్కిరయిపోయింది పాపం. తెలుసుకోలేకపోయాను మించిపోయేదాకా. అప్పుడేం చేయాలో అర్థమవలేదు. ఈ దారి దొరికింది- నా అదృష్టం. మృదుల పేర కొన్న కాంప్లెక్స్ అమ్మేసి ఇదంతా చేయగలిగాను" కాసేపు ఆగి అంటున్నాడు "నాకు తెలుసు నేను మృదులకి తగనని మీరను కొంటారని. నిజమేనేమో- కాని తనంటే నాకిష్టం, తను లేకుండా ఉండలేను. బ్యూటీ అండ్ ద బీస్ట్ కథలో బీస్ట్‌ని అయినా కాలేను- నాకూ శాపవిమోచనమవుతుందేమో చూద్దాం చూద్దాం" ఇల్లు చేరాము.

వాకిట్లో విరగబూసిన పారిజాతాలు ఆ శారద రాత్రిని పరిపాలిస్తున్నాయి. చలిగాలి అలలలో యమన్ కల్యాణి స్వరాలు నాట్యం చేస్తున్నాయి. అవును- ఇది మృదుల స్వస్థానం. అమృతమస్తు అన్న దీవెన నా మనసంతా నిండి ఉండిపోయింది.